తాగునీటి సమస్యకు పరిష్కారం

- రూ.60 లక్షలతో ఇన్‌ఫిల్టర్ బావి నిర్మాణానికి చర్యలు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు



ఇన్‌ఫిల్టర్ బావి నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని భాసూరు గ్రామస్తులను దీర్ఘకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు ప్రభుత్వం చెక్ పెట్టింది. రూ.60లక్షల వ్యయంతో రావాడ గెడ్డ వద్ద రక్షిత తాగునీటి పథకానికి నీటిని అందించే ఇన్‌ఫిల్టర్ బావి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వీటి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధికి కూడా కట్టుబడి ఉందన్నారు. సర్పంచ్ శిర్లాపు మల్లేశ్వరమ్మ మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రక్షిత పథకం నిర్మించినా నీటి సదుపాయం లేక గ్రామస్తులు దశాబ్దాలు ఇబ్బందులు పడ్డారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతో జగనన్న ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. నిధులకు కృషి చేసిన స్థానిక నేతలకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, సర్పంచ్‌లు ఎస్.విజయ్‌కుమార్, ద్వారపూడి కుమార్, నాగవంశపు కార్పొరేషన్ డైరెక్టర్ నల్లి శివప్రసాద్, పాలవలస ధవళేశ్వరరావు, లెంక చంద్రమౌళి, అల్లెన పకీరు నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఐదో విడత 'రైతుభరోసా'

పాలకొండ: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతు భరోసా పథకం ఐదో విడత పంపిణీ కార్యక్రమాన్ని గురువారం డివిజన్ కేంద్రంలో నిర్వహించనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి ఈ పథకం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు కార్యక్రమంలో పాల్గొననున్నారు. రైతులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని మన్యం జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్ పాల్ కోరారు.

పరిశుభ్రతతో వ్యాధులకు అడ్డుకట్ట

వీరఘట్టం: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం వ్యాధులను తరిమికొట్టవచ్చునని వీరఘట్టం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో పరిసరాల పరిశుభ్రతపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు బుధవారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో మన పరిశుభ్రత అంశంపై ప్రజలను చైతన్యం కల్పించాలన్నారు.

108 సిబ్బందికి శిక్షణ

పాలకొండ రూరల్: 108 సిబ్బంది (ఈఎంటీలకు) స్థానిక ఏరియా ఆస్పత్రిలో 12 సంవత్సరాలలోపు చిన్నారులకు అందించే ప్రథమ చికిత్స, నూతన వైద్య విధానాలపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎయిమ్స్ జిల్లా మేనేజర్ ఎస్.మన్మధరావు, ఏజీటీ అల్లుబిల్లి శ్రీనివాసరావు శిక్షణ కొనసాగించారు. ముఖ్యంగా పిల్లల్లో అపస్మారక స్థితి, సీపీఆర్ చేయటం, ఆరోగ్య సమస్యలు వాటి తక్షణ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. 108 వాహనాల్లో సమకూరుస్తున్న మందులు, పరికరాలు వాటి వినియోగంపై వివరించారు. కార్యక్రమాన్ని పాలకొండ డివిజన్ 108 విభాగం ఓయూ విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

వీధి కుళాయిలకు ట్యాప్‌ల ఏర్పాటు



గ్రామీణ బ్యాంకు వీధిలో కుళాయికి ట్యాప్‌ను అమరుస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో చింతలగూడ వీధి, చాకలి వీధి, పాత బస్టాండ్ వీధి, గ్రామీణ బ్యాంకు వీధి, గడ్డి కాలనీల్లో పంచాయతీ కుళాయిలకు ట్యాప్‌లను బుధవారం అమర్చారు. గతంలో పలుచోట్ల కుళాయిలకు సంబంధించిన ట్యాప్‌లు లేకపోవడం, ఉన్నా లీకై నీరు వృథా అయ్యేది. దీన్ని గమనించిన సర్పంచ్ బి.గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్‌లు స్పందించి తగు చర్యలు చేపట్టారు. నీటి వృథాను అరికట్టే చర్యలు చేపట్టారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ రూరల్: మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. పాలకొండ బుధవారం వచ్చిన సీఐటీయూ రాష్ట్ర ప్రచార జాతాలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ, దావాల రమణారావు, మండల కార్యదర్శి కాద రాము తదితరులు మాట్లాడారు. 010 కింద వేతనాలు చెల్లించాలని, పాత పెన్షన్ విధానం అమలు, టైం స్కేల్ వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఏటీఎంల పరిశీలన



కరూర్ వైశ్య బ్యాంకు ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్ఐ

రామభద్రపురం: మండల కేంద్రంలోని ఏటీఎం కేంద్రాలను ఎస్ఐ సురేంద్రనాయుడు బుధవారం పరిశీలించారు. ఆయా ఏటీఎంల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా.. లేదా.. సక్రమంగా పని చేస్తున్నదీ, లేనిదీ.. సెక్యూరిటీ గార్డులు ఉన్నారా.. లేదా అని పరిశీలించారు. అనంతరం స్టేట్ బ్యాంకు మేనేజర్‌తో ఆయన మాట్లాడారు. ఏటీఎంల వద్ద దొంగతనాలు, సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో భద్రత దృష్ట్యా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అజెండా ఆమోదం

బొబ్బిలి: మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవదీసిన అంశాలకు, అజెండాలోని అంశాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో పట్టణంలోని ప్రధాన రహదారులపై వెలసిన ఆక్రమణలను తొలగించాలని సభ్యులు కోరారు. దీని వలన ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. అలాగే శ్మశాన వాటికలు బాగు చేయాలని, సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని కౌన్సిలర్లు కోరారు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు కౌన్సిలర్లంతా పచ్చజెండా ఊపారు.

సేంద్రియ సాగుతో లాభం



మచాన పద్ధతిలో విత్తనాలు వేసే విధానం చేసి చూపిస్తున్న వాసన్ ప్రతినిధులు

భామిని: సేంద్రియ వ్యవసాయ విధానంలో మంచి లాభాలు ఆర్జించవచ్చని వాసన్ సంస్థ కుండింగి రవి కుమార్, ముద్దాడ భార్గవి అన్నారు. ఈ విధానంలో కూరగాయల సాగు మరింత లాభాలను ఇస్తుందన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా మణిగ, మూలగూడ, భామిని, బొడ్డగూడలకు చెందిన గిరిజన రైతులతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తక్కువ విస్తీర్ణంలో వివిధ రకాల కూరగాయల సాగు విధాన పద్ధతులను వివరించారు. సేంద్రియ పద్ధతిలో కషాయాల తయారీ, జీవామృతాలు పిచికారీ చేసే విధానాలను వివరించారు. వాసన్ ప్రతినిధులు, ఆదివాసీ రైతులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజం నిర్మిద్దాం



అంపిలి గ్రామంలో అవగాహనా ర్యాలీ

పాలకొండ రూరల్: పొగాకు రహిత సమాజం నిర్మిద్దామని స్థానిక జనచేతన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బి.శశిభూషణ చౌదరి అన్నారు. పొగాకు నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని అంపిలి గ్రామంతో పాటు పట్టణంలోని పలు కూడళ్ల వద్ద భవన నిర్మాణ, ఉపాధి సిబ్బందితో కలసి బుధవారం అవగాహనా ర్యాలీలు చేపట్టారు. ధూమపానం, పొగాకు సంబంధిత పదార్థాల వలన కలిగే అనర్థాలు, పర్యావరణం, ఆరోగ్యంపై వాటి ప్రభావం ప్రజలకు వివరించారు. ప్రజలు చైతన్యవంతులై మెలగాలన్నారు. కార్యక్రమంలో జనచేతన సిబ్బంది ఎం.సరస్వతి, ఎల్.కృష్ణ, శివకుమార్, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



చిననందబలగ ఆలయంలో ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణ విగ్రహాలు



బాడంగి: రామాలయ ప్రతిష్ఠ పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని చిననందబలగ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా వేదపండితులు గన్నవరపు సుబ్రహ్మణ్య శర్మ, చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ విగ్రహాలను ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య బుధవారం ప్రతిష్ఠించారు. సీతారాములకు ఘనంగా వివాహం జరిపించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా రామాలయ ప్రతిష్ఠ పూజలు

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో సీతారామాలయ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. మూడు రోజులుగా చేపట్టిన ప్రతిష్ఠ మహోత్సవ పూజల్లో భాగంగా చివరి రోజు బుధవారం పూర్ణకుంభం, స్వామివారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేపట్టారు. ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉడమల అప్పలనాయుడు, ఎంపీటీసీ వంగపు రమేష్, మాజీ ఎంపీటీసీ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వేతనదారులకు శతశాతం పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని ఎస్సీ, ఎస్టీల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వేతనదారునికి శతశాతం పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం ఉపాధి క్షేత్ర, సాంకేతిక సహాయకులతో ఏపీఓ జగదీశ్వరరావు అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారుల సంఖ్యను ఘననీయంగా పెంచాలని క్షేత్ర, సాంకేతిక సహాయకులకు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో జాబ్‌కార్డు లేని వారిని గుర్తించి వారందరికీ వెంటనే జాబ్‌కార్డులు మంజూరు చేయాలని అన్నారు. ఉపాధి ఏపీడీ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు మరింత వేగంగా జరిగేలా చూడాలన్నారు. రోజువారీ వేతనం గిట్టుబాటు అయ్యేలా వేతనదారులతో పనులు చేయించాలన్నారు. ఉపాధి మండల ఏపీఓ జగదీశ్వరరావు మాట్లాడుతూ వేతనదారులకు వారి జాబ్‌కార్డు నంబర్, ఎన్ని రోజులుగా పని చేస్తున్నదీ, వేతనం ఎంత వస్తుందనే విషయాలు వారికి క్షేత్ర సహాయకులు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, ఉపాధి ఈసీ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సమగ్ర భూ సర్వే



రైతుల సమక్షంలో సమగ్ర భూ సర్వే చేపడుతున్న రెవెన్యూ అధికారులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు, భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ బి.బుచ్చయ్య అన్నారు. పాలకొండ – వీరఘట్టం రహదారిలో సమగ్ర సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం చేపట్టారు. రైతుల సమక్షంలో డ్రోన్ యంత్రాలతో ఈ ప్రక్రియ కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పట్టణ పరిధిలో వార్డు సచివాలయాలకు సంబంధించి దశల వారీగా భూ సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో రైతుల, యజమానుల సందేహాలను నివృత్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు పి.వెంకటరావు, సచివాలయ సర్వేయర్లు నాగరాజు, మణి, వీఆర్వోలు బలివాడ సాయిశ్రీనివాస్, పాలవలస రమేష్, శ్రావణ సందీప్ జయసుధ, మేఘన, రామారావు తదితరులున్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తెర్లాం: చిన్నతనం నుంచి యోగాసనాలు వేయడం అలవాటు చేసుకోవాలని, యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రతకు దోహదపడుతుందని స్థానిక శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పుస్తక పఠనంతో పాటు క్రీడల్లో పాల్గొనడం, యోగాసనాలు వేయడం వంటి వాటిపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

గుమ్మలక్ష్మీపురం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులు శత శాతం రాయితీపై పండ్ల తోటల పెంపకం చేపట్టుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఏపీఓ శివరామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మామిడి, జీడి మామిడి, చీని, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోటా, దానిమ్మ, 5లేయర్స్ బహుళ పంట(ఏపీసీఎన్‌ఎఫ్), కొబ్బరి, సీతాఫలం, సీతాఫలం (గట్లపై నాటు మొక్కలు), అల్లనేరేడు, చింత, ఆపిల్‌బేర్, డ్రాగన్‌ఫ్రూట్, గుండు మల్లెలు, గులాబి పూలు, మునగ వంటి పండ్ల, పూల తోటలను రైతులు సాగు చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం రెండు నుంచి మూడు సంవత్సరాల పాటు రైతులకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా లబ్ధిని అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

భామిని: మండలంలోని ఘనసరలో శ్రీఅభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం సీతారాముల కల్యాణాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా చేపట్టిన ప్రతిష్ఠాపన ఉత్సవాలను ముగిశాయి. వేద పండితులు ఆరవెల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య ప్రతిష్ఠాపన ఉత్సవాలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కురుపాం: మండల కేంద్రంలోని పైనలవీధికి చెందిన భాష అనారోగ్యంతో మూడు రోజుల కిందట మృతి చెందగా విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. తమ వంతు సాయంగా కొంత మొత్తం నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు.

ధూమపానంతో కేన్సర్ ముప్పు



సీహెచ్‌సీలో రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బాడంగి: ధూమపానం చేసే వారికి పలు రోగాలు వస్తాయని సీహెచ్‌సీ దంత వైద్యులు డాక్టర్ నాగేశ్వర్ అన్నారు. ప్రపంచ ధూమపాన నిరోధక దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ తాగడం వల్ల పలు రోగాలకు గురవుతున్నారు. ముఖ్యంగా కేన్సర్ వచ్చే ముప్పు ఎక్కువన్నారు. దీన్ని గుర్తించి ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజారమేష్, మేఘన, విశ్వనాథ్, ఆశా వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

రేగిడి: జీవామృతంతో పంటలకు మేలు చేకూరుతుందని, చీడపీడలు నివారించబడతాయని ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ సీహెచ్ శారద అన్నారు. మండలంలోని ఉంగరాడ యూనిట్ పరిధిలోని సోమరాజుపేటలో కోట్ల నారాయణరావుకు చెందిన పంట పొలంలో వేసిన మినప పంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న మినప పంట ఆరోగ్యవంతంగా ఉందన్నారు. గ్రామంలోని 25 మంది సభ్యులతో ఐదు బృందాలుగా ఏర్పడి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీమాస్టర్ కిరణ్, ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు, వీహెచ్‌ఏ అసిరినాయుడు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రామమందిర ప్రారంభోత్సవం

సంతకవిటి: మండలంలోని మందరాడలో వేద పండితులు పులఖండం శ్రీనివాసరావుశర్మ, అంపోలు రుద్రకోటేశ్వరరావుశర్మల ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న ప్రారంభోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు స్వామివారికి పూర్ణాహుతి, మహాశాంతి హోమం, జయాదులు, యంత్ర, మూర్తి శిఖర ప్రతిష్ఠలు, కళావాహన, ప్రాణ ప్రతిష్ఠలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు.

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



విత్తన షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

పాలకొండ: పట్టణంలోని విత్తన షాపుల్లో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.రామారావు, సిబ్బంది, మండల వ్యవసాయ శాఖ అధికారిణి వై.వాహిణి వీరఘట్టం రోడ్డులో ఉన్న నాగార్జున రైతు సేవా కేంద్రంలో తనిఖీలు చేశారు. ఈ సంవత్సరానికి సంబంధించి విత్తన నిల్వల్లో తేడాలు లేవని గుర్తించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరకే రైతులకు విత్తనాలు విక్రయించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో ఈ వాహనాలపై అవగాహన



ఈ వాహన ప్రదర్శనను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్

పాలకొండ: శ్రీకాకుళం జిల్లా నెడ్ క్యాప్ గో ఎలక్ట్రిక్ – గో గ్రీన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎలక్ట్రికల్ వాహనాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ప్రారంభించి వాహనాలను నడిపి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరు ఈ వాహనాలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ ఐవి.సుబ్రహ్మణ్యం, క్షేత్ర స్థాయి అధికారి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న చైర్మన్ రాధాకుమారి

పాలకొండ: సమన్వయంతో పని చేయడం ద్వారా అభివృద్ధి సాధించాలని నగర పంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి అన్నారు. బుధవారం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనుల కోసం తీర్మానం చేశారు. సమావేశంలో కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైన్‌తో భవిష్యత్



కళాకృతుల తయారీపై శిక్షణ అందిస్తున్న ఫ్యాషన్ డిజైనర్

పాలకొండ రూరల్: సమాజంలో ఫ్యాషన్ డిజైనర్లకు మంచి భవిష్యత్ ఉందని అంకురం ఫ్యాషన్ డిజైనర్, కోర్సు డైరెక్టర్ అల్లు ప్రియ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఫ్యాషన్ డిజైన్‌పై బుధవారం అవగాహన కల్పించారు. అందుబాటులో ఉన్న వస్తువులను సద్వినియోగపర్చుకుని కళాకృతులను తయారు చేసుకునే విధానంపై తర్ఫీదు అందించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయులు జి.మురళి సహకారంతో విద్యార్థులు కళాకృతులను తయారు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి గణేష్‌బాబు, సహాయకులు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ పోలినాయుడు

గరుగుబిల్లి: నవ ధాన్యాల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ వి.పోలినాయుడు అన్నారు. మండలంలోని నాగూరులో నవధాన్యాల సాగు విధానంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించి నవధాన్యాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటను సాగు చేయడానికి 40 రోజుల ముందు నవ ధాన్యాలను సాగు చేసి కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. దీనివల్ల రసాయనిక ఎరువులు వినియోగం తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ బి. శ్రీనివాసరావు, ఏపీ సీఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన జగనన్న సేవకులు

- వలంటీర్లకు వందనంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



తుమరాడలో వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: జనం మెచ్చిన జగనన్న సేవకులు వలంటీర్లు అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని భాసూరు, అర్దలి, ఎల్ఎల్ పురం, పెద్దకోటిపల్లి గ్రామ పరిధిలో ఉత్తమ వలంటీర్లను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను అవస్థలకు గురిచేసిందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ కష్టమైన కోవిడ్‌తో పాటు వివిధ దశల్లో ప్రజలకు అండగా నిలిచిందన్నారు. వలంటీర్ల సేవలకు వెలకట్టలేమని చింతాడ సర్పంచ్ దుప్పాడ కళావతి అన్నారు. తుమరాడ సర్పంచ్ శోభారాణి నేతృత్వంలో ఏర్పాటు చేసిన వలంటీర్ల వందన కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ డొంక త్రినాథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రీడా పోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

భామిని: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారిణి ఎ.సునీత ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.